# ఎదురుచూపు

"వస్తాడు నా రాజు ఈరోజు... తానె వస్తాడు నెలరాజు ఈరోజు..." తనలో తానే పాడుకుంటోంది లచ్చిమి. వెన్నెల కెరటాలపై మబ్బుల్లో తేలిపోతూ తెల్లగుర్రంపై స్వారీ చేస్తూ వస్తాడని జానపద నాయికలా కలలుగంటోంది...

"బావ...బావ... తన కిషన్‌బావ వస్తాడు... అఘమేఘాల మీద వస్తాడు... తెల్లవారేసరికి తన ముందొచ్చి వాలతాడు..." బావతో తన జీవితాన్ని ఊహించుకుంటూ కలలు కంటోంది లచ్చిమి... ఊహల్లో తేలిపోతోంది... తెల్లవారితే రాబోయే బావను తలుచుకుంటూ ఆమె మనసు దూదిపింజలా గాలిలో తేలిపోతోంది...

బావ కోసం తానెన్ని రోజులుగా ఎదురుచూస్తోంది...? నాలుగు సుదీర్ఘ సంవత్సరాలుగా కళ్లలో వత్తులేసుకొని ఎదురుచూస్తోంది. తన తల్లి వేరొకరితో పెళ్లి చేస్తానంటే చచ్చినా ఒప్పుకోనంది... చావైనా బతుకైనా తనకు బావేనంది... ఇక బెంగలేదు. బావ రేపే వస్తున్నాడు కదా...? రేపటి దాకా ఎందుకు? కొద్ది గంటల్లో...

లచ్చిమికి తన బావ నండూరి వారి నాయుడిబావే...ఆమె ఎంకే... లచ్చిమి విశ్వనాథవారి కిన్నెరసానే...

అరుగుమీదున్న నులక మంచంలో వెల్లకిలా పడుకుంది లచ్చిమి... ఆమె మనస్సు నిండా బావే... అణువణువునా బావ గురించిన జ్ఞాపకాలే... ఆమెకెంత ప్రయత్నించినా నిద్ర రావడంలేదు... బావ గురించి ఎంతగా జ్ఞాపకం చేసుకున్నా ఇంకా మిగిలిపోతూనే ఉంది. తన ముద్దుల బావను జ్ఞాపకం చేసుకుంటూ ఆమె మనసు గతంలోకి పరుగిడింది...

☆ ☆ ☆

కిషన్ తండ్రి, లచ్చిమి తండ్రి బావ బావమరుదులు... కిషన్ లచ్చిమికి మేనత్త కొడుకు... ఇద్దరివీ వ్యవసాయ కుటుంబాలే... ఇద్దరిళ్లూ, పొలాలూ పక్కపక్కనే... బావ, బావమరుదులిద్దరూ ఒకరికి మద్దతుగా మరొకరు నాగళ్లు కట్టేవారు... ఒకరోజొకరి చేలో, మరొకరోజు మరొకరి చేలో దున్నేవారు... కలిసి పనులు చేసేవారు.

లచ్చిమి పుట్టగానే కిషన్‌కు పెళ్లాం పుట్టిందన్నారందరూ... వాళ్లిద్దరూ కలిసి ఆడుకునేవారు... పాడుకునేవారు... వ్యవసాయప్పనులూ కలిసే చేసేవారు... కిషన్ నాగలి దున్నుతుంటే లచ్చిమి విత్తనాలేసేది. కిషన్ వరిగుజ్జులు తీసుకొచ్చిస్తే లచ్చిమి నాటేసేది.

ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే అలుపూసొలుపూ లేదన్నట్టుగా వాళ్లిద్దరూ బండెడుపని చేసేవారు. ఒకరితో ఒకరు పోటీపడి మరీ చేసేవారు. వాళ్లిద్దరూ కలసి పనిచేస్తుంటే సమయమే తెలిసేది కాదు... ఒకరి సమక్షంలో ఒకరు రెట్టింపుగా పనిచేస్తూ భోజనం చేసే సమయమైందని మరిచిపోయేవారు... వాళ్లకాకలీ జ్ఞాపకమొచ్చేది కాదు... అవసరమైతే ఇద్దరిపనీ ఒకరే చేసేవారు...

"ఇద్దరికీ తొందరగా పెళ్లిచేస్తే సరిపోతుంది...మరింత కలిసి పనిచేస్తారు... ఇంకా ఎక్కువ పంట పండిస్తారు... ఇద్దరి జంటా చిలకాగోరింకల్లా ఉంటుంది..." అనేవారు ఊరివాళ్లు.

"కక్కొచ్చినా కల్యాణమొచ్చినా ఆగదు. దేనికైనా సమయం కలసిరావాలి..." అనేవారు వాళ్ల తల్లిదండ్రులు.

చిన్నవయసులోనే వాళ్ల పెళ్ళి చేయాలనుకున్నారు. రెండు మూడునెలల్లో అయిపోయేదే... అయితే ఓ విషయంలో వాళ్ల తండ్రులు పోట్లాడుకున్నారు. పెద్దవాళ్లకు పట్టింపు లెక్కువ... వాళ్లు పట్టుదలలకు పోయి పెళ్లి చేయడానికి వీల్లేదన్నారు. కొద్ది రోజులు తర్వాత ఇద్దరికీ వేరే సంబంధాలు చూడటం మొదలుపెట్టారు. కాని లచ్చిమి, కిషన్ ససేమిరా ఒప్పుకోలేదు. తిట్టినా, కొట్టబోయినా తమ పట్టు వదల్లేదు. చేసేదేంలేక ముసలివాళ్లు తమ ప్రయత్నాలను విరమించుకున్నారు...వాళ్లమధ్య సఖ్యత కుదరడానికి రెండు మూడేళ్లు పట్టింది...

ఈలోగా కిషన్‌వాళ్ల పొలం కొంత అప్పుల కింది కమ్ముడుపోయింది. లచ్చిమి తండ్రి కిషన్‌తో పెళ్లి వద్దన్నాడు...

"బావకేముందని వాడంటే పడిచస్తావు? ఉన్న పొలమే తక్కువంటే అందులోంచి కొంత అమ్ముడుపోయింది... ఉన్న భూమిలో నిన్నెలా పోషిస్తాడు...? నీకో మంచి సంబంధం చూస్తాను... మారు మాట్లాడకుండా పెళ్లికి ఒప్పుకో" అన్నాడు.

తండ్రి మాటలు విని లచ్చిమి ఇంట్లో ఉన్న సామాన్లన్నీ విసిరికొట్టింది. ఇల్లంతా చిందరవందర చేసింది. తండ్రిని తిట్టింది... ఏడ్చింది.

కిషన్‌తోనూ అతని తల్లితండ్రులు మేనవాళ్లైతే కట్నమెక్కువగా ఇవ్వరని, వేరే వాళ్లైతే ఎక్కువ... కట్న మొస్తుందన్నారు... ఎన్ని చెప్పినా కిషన్ ఒప్పుకోలేదు.

వాళ్లిద్దరూ ఒకరికోసమొకరు పుట్టామనే భావించారు... ఇరువైపుల పెద్దల ప్రయత్నాలు విఫలంకాగా వాళ్లిద్దరి పెళ్లి చేయడానికే నిర్ణయించుకున్నారు పెద్దలు... వాళ్ల ఆమోదముద్ర లభించగానే ఎగిరి గంతేశారు లచ్చిమి, కిషన్...

అయితే, పెళ్లి పెట్టుకుందామనేసరికి లచ్చిమి తండ్రి చనిపోయాడు... ఏడాది గడిచేవరకు ఇంట్లో ఏ శుభకార్యం చేయకూడదన్నారు... కిషన్ తండ్రి వేరే సంబంధం చేస్తానంటే అతడొప్పుకోలేదు... చూస్తుండగానే ఏడాది గడిచిపోయింది. మళ్లీ పెళ్లి ప్రయత్నం చేసేంతలో కిషన్ తండ్రి చనిపోయాడు... లచ్చిమిని రకరకాల మాటలన్నారు జనం... లచ్చిమి తల్లి ఆ సంబంధం వద్దంటే ఆమె ఒప్పుకోలేదు... తన పెళ్లంటూ జరిగితే బావతోనే నంది...

ఆ ఏడాది కూడా గడిచింది...

ఇప్పుడు ఇంటి యజమానులిద్దరూ పోయారు... వాళ్ల పెళ్లి గురించి దుఃఖంలో ఉన్న ఆడవాళ్లు పట్టించుకునే స్థితిలో లేరు... ఓరోజు కిషన్‌ను కలుసుకుంది లచ్చిమి.

"బావా...! మూణ్ణాలుగేళ్లుగా మనపెళ్లి దగ్గరికొచ్చినట్టే వచ్చి దూరం పోతోంది... ఇప్పుడు మాట్లాడటానికి మన నాన్నలు లేరు... ఆడవాళ్లు దుఃఖంలో ఉన్నారు. మన పెళ్లి గురించి మనమే చొరవ తీసుకోవాలి..."

కిషన్ ముఖం చిన్నబోయింది... ఆమెకేం సమాధానం చెప్పలేదు.

"ఏమైంది బావా?... మాట్లాడవేంటి...?" అంది.

"ఏం మాట్లాడమంటావు లచ్చిమీ... మనం పెళ్లికోసం ఇంకొద్ది సంవత్సరాలైనా ఆగాలి..." అన్నాడు నెమ్మదిగా కిషన్.

"ఎందుకు బావా...?" ఆశ్చర్యపోతూ అంది లచ్చిమి.

"లచ్చిమీ! మనం ఒకరికోసమొకరం పుట్టాం... ఎన్నో ఏళ్లుగా ఒకరికోసమొకరం ఎదురు చూసుకుంటున్నాం... ఇంకొద్ది రోజులు ఈ ఎదురుచూపులు తప్పవు... మన పెళ్లైతే నిన్ను సుఖపెట్టాలి... అందుకోసం డబ్బు కావాలి... ప్రస్తుతం నాకున్నది ఈ పాతిల్లు... ఉన్న కొద్దిపాటి భూమిమీద అప్పులున్నాయి... మనం ఉండటానికి ఈ ఇంటి స్థానంలో చిన్నదైనా కొత్త ఇల్లు కావాలి... ఉన్న అప్పులు తీర్చాలి... ఇంకొంత పొలం కొనుక్కోవాలి... ఆ తర్వాతే మన పెళ్లి..."

కిషన్ మాటలు విన్న లచ్చిమి కళ్లవెంట నీళ్లు కారుతున్నాయి... "బావా...! నీతో గుడిసెలో – అదీ లేకుంటే చెట్టునీడలోనైనా బతకడానికి నేను సిద్ధమే. మన పెళ్లైతే మనింటికోసం నీతోపాటు నేనెంతైనా కష్టపడతాను."

"నా ముద్దుల లచ్చిమితో నేను అరవచాకిరీ చేయించదలుచుకోలేదు... మన సుఖం కోసం నేను కొంతైనా డబ్బు సంపాదించాలి..."

"బావా...! ఎన్నడూలేంది నీకీ డబ్బు పిచ్చెందుకు పట్టుకుంది...? మనరెక్కలు చల్లగుంటే చాలు... హాయిగా బతకొచ్చు..."

"నీకు తెలియదు లచ్చిమీ... మా ఇంటి పరిస్థితి ఇప్పుడేం బాగాలేదు... నాన్న చనిపోయింతర్వాత ఆ రోజు నుండి ఏడాది మాసికం వరకు చాలా ఖర్చులయ్యాయి...ఇదివరకే ఉన్న అప్పుల్తోపాటు మరిన్ని అప్పులు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో మనం పెళ్లిచేసుకొని పిల్లలను కంటూపోతే ఖర్చులూ పెరుగుతాయి. ఈ వ్యవసాయంతో అప్పులు తీర్చడమూ సాధ్యంకాదు. మన పిల్లలకు అప్పులివ్వడం కాదు చేయాల్సింది. మనలా కాకుండా వాళ్లను బాగా చదివించాలి... వాళ్లకోసమైనా డబ్బు సంపాదించాలి... మన పిల్లలకోసం!... అందుకే కొన్ని రోజులు నేను బయట కెళ్తాను..."

కిషన్ మాటలు విని మరీ ఆశ్చర్యపోయింది లచ్చిమి...

"అంటే, ఎక్కడికెళ్తావు బావా నువ్వు...?" అంది.

"మస్కట్‌కు పోతాను. మన భవిష్యత్తు కోసం నువ్వు కొద్దిరోజులోపిక పట్టాలి... నేనొచ్చింతర్వాతే మన పెళ్లి..."

"ఏమో బావా...! నాకు నిన్ను వదిలి ఉండడమిష్టంలేదు... నువ్వు పోకుంటేంబోతుంది...? మనం బతకలేమా...?"

"నే పోయేది మన కుటుంబం కోసం... ఇన్ని అప్పులుండగా పెళ్లి చేసుకొని మనం సుఖపడలేం... పనిచేస్తున్నా అప్పులే మన కళ్ళ ముందు కదుల్తుంటాయి... రెండేళ్లనగా ఎంతలో గడిచిపోతాయి...? ఆ తర్వాత పెళ్లి చేసుకొని మనం హాయిగా ఉండొచ్చు..." అన్నాడు లచ్చిమిని దగ్గరకు తీసుకొని కిషన్.

"బావా...! బావా...!" అంటూ జరిగిందామె...

"ఏంటో చెప్పు...!"

"నువ్వు మస్కట్‌పోయి బాగా పైసలు సంపాదించి నన్ను మరిచిపోతావేమో... అప్పుడు నేను నీ కళ్లకు కనబడతానా...?"

"ఓ పిచ్చిదానా! మనం పుట్టినపుడే మనకు బ్రమ్మముడి పడింది... నేను మస్కెట్‌కు పోయేదే నీ సుఖం కోసం... నేనెంత డబ్బు సంపాదించినా నా మనసులోకి మరో అడది రాదు... డబ్బున్న వాళ్లలా, కొందరు చదువుకున్న వాళ్లలా నా మనసేం మారదు..."

కిషన్ ఛాతీమీద తలపెట్టి తనివితీరా ఏడ్చింది లచ్చిమి... ఆమెను హృదయానికి హత్తుకొని ఓదార్చాడు కిషన్.

"ఇప్పుడేం జరిగిందని ఏడ్వడం...? డబ్బు సంపాదించి తొందరగానే నీ పాదాల ముందు వాలుతాను..." అన్నాడు.

కిషన్ వెళ్లే రోజున కన్నీటి పర్యంతమైంది. కడుపునిండా కడివెడు దుఃఖంతో వీడ్కోలిచ్చింది... బస్సు కనుమరుగయ్యేంతవరకూ అక్కడే నిల్చుంది... ఆ తర్వాత శూన్యంలోకి చూడసాగింది.

ఆమె తల్లి చేయిపట్టుకుని ఆమెను ఇంటికి తీసుకెళ్లింది. బావ ఊరెళ్లిన రోజునుండీ రోజులు లెక్కపెడుతూనే ఉంది లచ్చిమి.

తెల్లవారినుంచే ఆమె నిరీక్షణ ప్రారంభమైంది. ఏ పని చేస్తున్నా ఆమెకు బావ ధ్యాసే.

మస్కట్ నుండి వచ్చిన వాళ్లను తన బావ గురించి అడుగుతుంది. పొరుగూర్లలో అక్కణ్ణుంచి వచ్చిన వాళ్లున్నారని తెలిసినా అక్కడికి వెళ్లి మాట్లాడొస్తుంది.

మళ్లీ పోయేవాళ్లతో బావకు కబురు పంపుతుంది.

ఆమెకెప్పుడూ బావ రాక గురించి ఆలోచనలే...

ఆ ఎడారిలో బావ ఎలా ఉంటున్నాడో? ఏం తింటున్నాడో? ఎక్కడుంటున్నాడో? ఆ వేడినెలా తట్టుకుంటున్నాడో? తన కోసం ఎంత కష్టపడుతున్నాడో?

ఏడాది పైగా పనిచేసి పంపిన డబ్బు అక్కడకెళ్లడానికయిన ఖర్చులకి ఇదివరకున్న బాకీలు తీర్చడానికీ సరిపోయింది. అందువల్ల రెండేళ్లుకొస్తానన్న బావ మరో రెండేళ్లుంటానని ఉత్తరం ద్వారా తెలిపాడు. లచ్చిమి అలిగింది... తొందరగా రమ్మని ఉత్తరం రాయించింది...

తనకు వెంటనే వచ్చి లచ్చిమి ముందు వాలాలనున్నా, తాను ఊరొదిలిన ఉద్దేశ్యం పూర్తి కాదని, తానింకా రెండేళ్లుండక తప్పదనీ, తనకోసం ఓపిక పట్టమని ఉత్తరం రాయించాడు.

ఇక ఊరుకోక తప్పలేదామెకు... మరింత డబ్బు పంపాడు కిషన్. ఆ డబ్బుతో పాత ఇంటి స్థానంలో కొత్త పెంకుటిల్లు కట్టించింది కిషన్ తల్లి. లచ్చిమి ఆమెకు తోడుగా ఉండి అన్ని పనులూ చేసింది. తర్వాత పంపిన డబ్బుతో కొంత పొలం కొన్నారు.

కిషన్ చెప్పిన మరో రెండేళ్లూ పూర్తయ్యాయి...

ఈ రెండేళ్లలో ఆమె నిరీక్షణ మరీ ఎక్కువైంది. ప్రతి క్షణమూ బావ గురించిన ఆలోచనే. ఏ పని చేస్తున్నా, ఎక్కడున్నా బావ రూపమే ఆమె కళ్ల ముందు కదులుతుంది...

కిషన్ నుంచి వారం రోజుల క్రితమే ఉత్తరమొచ్చింది. కార్తీక పౌర్ణమి తెల్లవారేసరికి ఇంటిముందుటానని తెలిపాడందులో...

☆ ☆ ☆

బావ గురించే ఆలోచిస్తున్న లచ్చిమికి తెల్లవారి నట్టనిపించింది.

లేచి అత్తింటి వైపు నడిచింది. అరుగు మీద మంచం మీద పడుకొనున్న కిషన్ తల్లి ఎవరో వస్తున్న అలికిడి విని లేచి కూర్చుంది...

"ఏందే ఇప్పుడొచ్చినవు?" అంది.

"తెల్లవారుతోంది గదా అత్తా!"

కాబోయే కోడలు మాటలు విని నవ్విందామె. దగ్గరకు తీసుకుంది. "ఇప్పుడెక్కడ తెల్లారుతుందే? అర్ధరాత్రైనట్టుంది. పోయి పడుకో. లేకుంటె నా దగ్గర్నే పడుకో" అంది.

"నిద్ర పట్టడం లేదత్తా..."

"బావ కోసం ఎదురు చూస్తుంటే నిద్రెట్టా వస్తది? ఇన్నేండ్లాగిందానివి ఇంకొన్ని గంటలాగలేవా? వచ్చేవాడు రాకుండా ఉంటాడా? పోయి నిద్ర పో... మీ అమ్మ చూస్తే తిడుతది."

లచ్చిమి ఇంటికెల్లింది. కాని, ఆమె కెంతకూ నిద్ర రావడం లేదు. 'పందిట్లో పెళ్ళవుతుందని', 'బంగారు బొమ్మ రావేమే...' టేపురికార్డులో విన్న పాటలామె చెవుల్లో గింగురుమంటున్నాయి. బావ తన మెడలో తాళిగడ్తున్నట్టు, తాను సిగ్గుమొగ్గై కూర్చున్నట్టూ ఊహించుకుంటోంది...

ఇంతకూ బావిప్పుడెలా ఉన్నాడో? బాగా పనిచేసి చిక్కిపోయాడేమో...!

కొద్దిసేపాగి బయటకు చూసిన లచ్చిమికి తెల్లవారుతున్నట్టనిపించింది... 'బావొచ్చేసరికి రెండిళ్ల ముందూ అలుకు జల్లి ముగ్గులేయాలి...'

తల్లి వద్దంటున్నా వినకుండా వాకిలూడ్చింది. అలుకు జల్లింది. ముగ్గులేసింది.

అత్త ఇంటికెళ్లి వాకిలూడ్చి, కళ్లాపి జల్లింది. వేలు పెట్టడానికి సందు కూడా లేకుండా ముగ్గులేసింది.

"తెల్లవారుతోందా అత్తా..."

ఆకాశం వైపు చూసిందామె.

తెల్లవారే చుక్క పొడిసింది. గోరుకొయ్య చుక్కలు వంగాయి. ఇంకో రెండు మూడు గంటల్లో తెల్లవారుతుంది...

"ఇంకా రెండు మూడు గంటలా?" గొణుక్కుంది.

పళ్లు తోముకొని ముఖం కడుక్కుంది. బావి దగ్గరున్న స్నానాల గదిలో రెండు బకెట్లతో నీళ్లు పెట్టుకుంది. గదిలోకెళ్లి తలుపేసుకుంది...

కిషన్ బావను తలుచుకుంటూ స్నానం ముగించింది. మస్కట్ నుండి ఏడాది క్రితం బావ పంపించిన చీర కట్టుకుంది. జాకెట్ వేసుకుంది. తల దువ్వుకుంది. ఇంటి వెనుకున్న మల్లెపూలు తెంపుకొంది. మాల కట్టుకుంది. జడ వేసుకొని మాల తలలో తురుముకుంది...

'ఇంకా తెల్లవారదేంటి? కోడెందుకు కూయటం లేదు?' అనుకుంటూ అత్తింటి కెళ్లింది...

కొడుకు రాక కోసం ఎదురు చూస్తున్న ఆమెకూ నిద్రపట్టడం లేదు...'

"అత్తా! కోడి కూసిందా?"

"నీ కోసం కోడి ముందే కూస్తుందా? నీకున్న తొందర దానికెందుకుంటుంది?"

అత్త మాటలు విని తనలో తాను నవ్వుకుంటూ ఇంటికెళ్లింది...

ఆమెకెక్కడా కాలు నిలువడం లేదు.

పూలు నలిగిపోతాయని, చీర మడతలు పడుతుందని సుతారంగా మంచం మీది కొరిగింది... బావ జ్ఞాపకాలను మననం చేసుకుంటూ అతని రూపాన్ని మనసులో నింపుకుంటోంది... తాము కలిసి బతుకబోయే బతుకుగూర్చి కలలుగంటోంది.

ఊహల్లో తేలిపోతోంది...

"కొక్కొరోకో..." కోడి కూత శ్రవణపేయంగా వినబడింది లచ్చిమికి.

మంచంమీంచి గబుక్కున లేచింది... ఒక్క అంగలో అత్త దగ్గరకురికింది...

"అత్తా! అత్తా! కోడి కూసింది. బస్సొచ్చే వేళయింది. లే... లేచి తొందరగా మంచమెత్తు..." అంది.

"అబ్బ, నీ తొందర పాడుగాను... నువ్వు నిద్రపోవు... నన్ను నిద్రపోనియ్యవు...బావ మీద అంత భ్రమలానె..." లేచి మంచమెత్తుతూ అంది అత్త.

అత్తమీద కోపమొచ్చింది లచ్చిమికి...

వాకిట్లోకి చూస్తూ అరుగు మీద కూర్చింది.

ఊరు అప్పుడే మేల్కొంటుంది. కొందరు కాలకృత్యాలు తీర్చకోవడానికి ఊరి బయటకెళ్తున్నారు వాకిళ్లూడ్చే ధ్వని వినబడుతోంది. కొందరలుకు జల్లుతున్నారు.

కొద్ది సేపట్లో ఊరి బయటకెళ్తున్న పశువుల గిట్టల చప్పుడూ వినబడ్తోంది. చెట్ల మీద పక్షులరుస్తున్నాయి...

లచ్చిమి కనురెప్ప పడకుండా బజారు వైపే చూస్తోంది...

రెప్పపడితే ఏం కోల్పోతానోనన్నట్టుగా చూస్తోంది...

మరికొద్ది నిమిషాలు గడిచాయి...

కిషన్‌తో మస్కట్‌లో పనిచేసే రాజం రెండు సూట్‌కేసులతో వచ్చి అక్కడ నిల్చున్నాడు...

రాజంను చూసి అరుగు దిగి వచ్చింది లచ్చిమి.

"రాజన్నా! రాజన్నా! బావేడే...?" అంది.

రాజం ఏం మాట్లాడలేదు. సూట్‌కేసులు కిందబెట్టాడు.

కిషన్ తల్లి, లచ్చిమి తల్లి, తమ్ముడు, మరికొంతమంది ఆ వాడవాళ్లొచ్చి అక్కడ నిల్చున్నారు.

"మాట్లాడవేందే రాజన్న... బావేడి? గోడ చాటుగున్నడా? దాగుడు మూతలాడుతండా?" అటూ ఇటూ చూస్తూ అంది లచ్చిమి.

రాజం ముఖం విచారగ్రస్తమైంది. అతని కళ్లవెంట బొటబొటా నీళ్లు కారుతున్నాయి. ఆమెకేం చెప్పాలో తోచడం లేదు...

"ఏందే, రాజన్నా ఏమైంది?"

"చెప్పు బిడ్డా! మన కిషనేడి?" అంది కిషన్ తల్లి.

"ఏం చెప్పాలి చెల్లీ? నాకు చెప్పడానికి నోరు రావడం లేదు. ఇప్పుడక్కడ యుద్ధం జరుగుతోంది కదా! అక్కడంటే మేమున్న చోట కాదు- ఇరాక్‌లో. దాని ప్రభావం మాదగ్గరా కొంతుంది. భారతదేశం ఇరాక్‌కు మద్దతుగా మాట్లాడిందని అందుకనుకూలంగా, వ్యతిరేకంగా మా దగ్గర కూడా లొల్లయింది. కొందరు పొడుచుకున్నారు. వారం కింద జరిగిన సంగతి... నేను, కిషన్ హోటల్‌కెళ్లి మా బస దిక్కు పోతున్నాం. ఎవరో ఉరికొచ్చి కిషన్ కడుపులో పొడిచి వెళ్లిపోయాడు. నాకండ్లముందే గిలగిలా తన్నుకుంటూ ప్రాణం విడిచాడు కిషన్. ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది. ఇదుగో కిషన్ సూట్‌కేసు... డబ్బు..." అని భోరుభోరున ఏడ్వసాగాడు రాజం.

కిషన్ తల్లి, లచ్చిమి తల్లి శోకాలు పెడుతూ మొత్తుకుంటున్నారు... ఒకరివెను కొకరు ఎంతోమంది గుమిగూడారక్కడ.

ఏడ్పులతో, పెడబొబ్బలతో ఆ వాడంతా శోకమయమైపోయింది...

లచ్చిమి అలాగే నోరు తెరుచుకొని నిలబడి ఉంది. ఆమె కళ్లవెంట ఒక్క నీటిచుక్క కూడా రాలడం లేదు...

ఎన్నో ఆశలతో, స్వప్నాలతో, ఆరాటంతో బావ కోసం సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న లచ్చిమి ఆశలు బుగ్గైపోయాయి... రాజం మాటలతో ఆమె షాక్‌తింది. ఆమె మతి చలించింది...

"నా బావ చనిపోలేదు. నా బావ చనిపోలేదు. నా బావ వస్తాడు. నా బావ బస్సులో ఎందుకొస్తాడు? పూలరథంపై వస్తాడు. నా బావ వస్తాడు. ఊరి బయటెళ్లాలి..." అని అరుస్తూ ఊరి బయటకు పరుగెత్తుతోంది లచ్చిమి... ఆమె వెనుక జనాలు... ఆమెనింటికి తీసుకురావడానికెంతో కష్టమవుతోంది వాళ్లకు.

☆ ☆ ☆

ఏళ్లు గడుస్తున్నాయి. అయినా లచ్చిమిలో ఏ మార్పూ లేదు. రోజూ తెల్లవారకముందే లేచి, స్నానం చేసి, అలంకరించుకొని, బావ కోసం గుమ్మం దగ్గర కూచొని ఎదురు చూస్తూనే ఉంది.

తన బావ వస్తాడని అందరితో చెబుతూనే ఉంది... ఒక్కోసారి ఊరి బయటకు పరిగెత్తుతోంది...

కుల మత దురహంకారాలు, జాత్యహంకారాలు, అధిపత్యవాదాలు, వర్ణ వర్గభేదాలు అనాదిగా కల్లాకపటం ఎరుగని ప్రేమికుల బతుకుల్లో, కిషన్, లచ్చిమిలాంటి అమాయకుల జీవితాల్లో చిచ్చును రేపుతూనే ఉన్నాయి.

ఎంత మంది ఎన్ని కావ్యాలు రాసినా, మహాత్ములెన్ని నీతి వాక్యాలను బోధించినా ఆ చిచ్చు రావణకాష్టమై ఇంకా మండుతూనే ఉంది.

● *ఈనాడు, ఆదివారం, 15-10-1995* ●

★ ★ ★